# 58

# యెరూషలేము నాశనమగుట

## (24:15-35)

24:15-35, యేసు శిష్యులడిగిన ప్రశ్నలకు ఆయన చెప్పుచుండిన సమాధానము కొనసాగించాడు. సైన్యసమూహములు యెరూషలేమును చుట్టుముట్టుట వారు చూచునప్పుడు, వారు పట్టణమును విడిచి పారిపోవలెనని ఆయన వారిని హెచ్చరించాడు (24:15-22). వారికి విడుదల కలుగజేయుదురని చెప్పుచుండు "అబద్ధపు క్రీస్తుల" మాటలు వారు ఆలకింపకూడదని వారికి అటుతరువాత చెప్పాడు (24:23-28). ఆ తరువాత, మనుష్యకుమారుని సూచన (24:29-31) మరియు పట్టణము నాశనమగు సమయము (24:32-35) గూర్చి ఆయన మాటలాడాడు.

### నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలమందు నిలుచుట మీరు చూడగానే ... పారిపోవలెను (24:15-22)

**15కాబట్టి ప్రవక్తయైన దానియేలుద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధస్థలమందు నిలుచుట మీరు చూడగానే - చదువువాడు గ్రహించుగాక-**
**16యూదయలో ఉండువారు కొండలకు పారిపోవలెను, 17మిద్దెమీద ఉండువాడు తన యింటిలోనుండి ఏదైనను తీసికొని పోవుటకు దిగకూడదు; 18పొలములో ఉండువాడు, తన బట్టలు తీసికొని పోవుటకు ఇంటికి రాకూడదు. 19అయ్యో, ఆ దినములలో గర్భిణులకును పాలిచ్చువారికిని శ్రమ. 20అప్పుడు మహా శ్రమ కలుగును గనుక మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతిదినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి,**
**21లోకారంభమునుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పుడును కలుగబోదు.**
**22ఆ దినములు తక్కువ చేయబడకపోయినయెడల ఏ శరీరియు తప్పించుకొనడు. ఏర్పరచబడినవారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును.**

**వచనము 15. నాశనకరమైన హేయవస్తువు** యుగ సమాప్తియందు రానైయున్నదని అనేకులు ఉపదేశించుదురు. ఏది ఏమైనా, ఈ సంఘటన ఎప్పుడు సంభవించునో యని మనము విస్మయమొందవలసిన అవసరం లేదు, ఏలయనగా యెరూషలేము పట్టణము మరియు దేవాలయము నాశనమగునని యేసు నిర్దిష్టముగా సెలవిచ్చాడు. లూకా వ్రాసిన సువార్తలో వ్రాయబడి యున్నట్లు, "*యెరూషలేము దండ్లచేత* చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమై యున్నదని తెలిసికొనుడి" అని చెప్పుచూ యేసు దీనిని స్పష్టంచేసాడు (లూకా 21:20). కాబట్టి, రోమా సైన్యము యెరూషలేమును సమీపించునప్పుడు ఇది జరుగునని వారు గ్రహించునట్లు వెనువెంట సంభవించు హెచ్చరికలు యెరూషలేములో నివసించుచుండిన వారి కొరకు ఇవ్వబడినవి.

"నాశనకరమైన హేయవస్తువు" గూర్చి **ప్రవక్తయైన దానియేలు** ముందుగా తెలియజెప్పాడు (దానియేలు 9:27; 11:31; 12:11). ఈయన పలికిన మాటలు, అంతియొకయ IV ఎపిఫనేస్, సెల్యూసిడ్‌ల పరిపాలకుడు, యూదుల దేవాలయములో దహనబలులు అర్పింపబడుచుండిన బలిపీఠము మీద గ్రీకు దేవతల రాజు జీయస్ పేరిట క్రీ.శ. 168లో, ఒక బలిపీఠమును నిర్మించి దానిపై ఒక పందిని బల్యర్పణ గావించినవాడు, చేపట్టిన దుర్మార్గపు కార్యములలో తొల్దొలుత నెరవేరినవి.[1] దానియేలు పలికిన మాటలు చిట్టచివరగా క్రీ.శ. 70లో సంభవింపనై యుండిన యెరూషలేము నాశనమునకు ఒక సూచనయై యుండిన హేయమైన వస్తువులో నెరవేరినవి.

ఈ నాశనకరమగు హేయవస్తువు **పరిశుద్ధ స్థలమందు నిలిచియుండునని** యేసు ప్రభువు చెప్పాడు, ఈ పరిశుద్ధ స్థలము దేవాలయమును సూచించుచుండినది (అపొస్తలుల కార్యములు 6:13; 21:28). యెరూషలేము నాశనము కాక మునుపు మరియు నాశనమగుచుండిన సమయంలో జరిగిన అనేక సంఘటనలు, "నాశనకరమైన హేయవస్తువు"గా వర్గీకరింపబడవచ్చును. ఇచ్చటి ఉల్లేఖనము, లోపలి ప్రాంగణములను ఆక్రమించుకొనుచు, ప్రజలను హతమార్చుట ద్వారా దేవాలయమును అపవిత్రము చేసిన యూదా మతము విషయంలో అత్యుత్సాహవంతులై యుండినవారిని సూచించుచుండినదై యుండవచ్చును.[2] జోసీఫస్ ప్రకారము, ప్రధాన యాజకుడైన అనానస్ వారి మధ్య నిలువబడి, "నిశ్చయముగా, దేవుని మందిరము ఇంత భారీ సంఖ్యలో నున్న హేయమైన వస్తువులతో నిండియుండుట, లేక ఇష్టమొచ్చినట్లుగా త్రొక్కబడకూడనివై యుండవలసిన ఈ పవిత్ర స్థలములు, రక్తపాతమును ఒడిగట్టుకొను దుర్మార్గుల పాదములతో నిండియుండుట నేను చూడక మునుపే నేను మరణించుట నాకు మంచిదై యుండునని" బిగ్గరగా మాటలాడాడు.[3] యెరూషలేము దేవాలయము తగులపెట్టబడినందు వలన నాశనమగుచుండిన సమయంలో, తీతు దేవాలయములోని పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించాడు.[4] అతని వెంబడి యుండిన సైనికులు పవిత్రమైన వస్తువులను కొల్లగొట్టి తిరిగి రోమా పట్టణమునకు కొనిపోయారు; ఈ సంఘటనలకు తీతు కమాను (ఆర్చ్ ఆఫ్ టైటస్) స్మారక చిహ్నముగా నిలుచుచున్నది. విజయోత్సవ వేడుకను జరుపుకొనుచు, వారి ప్రమాణముల మేరకు వెలుపలి ప్రాంగణములో బల్యర్పణలు గావించుచు రోమనులు యూదుల దేవాలయమును అపవిత్రము చేసారు.[5] ఏది ఏమైనా, రోమనులు దేవాలయమును అపవిత్రము చేయుట ముగించేలోగా, క్రైస్తవులు అచ్చోట నుండి తప్పించుకొని పారిపోవుట అప్పటికే ఆలస్యమైపోయింది (24:16).

ఆసక్తికరంగా, అప్రధానమైనదిగా నున్న ప్రకటనను, **చదువువాడు గ్రహించుగాక**, అని మార్కు చేసినట్లే (మార్కు 13:14), మత్తయి కూడ చేర్చాడు. ఇటువంటి సారూప్యములు సాహిత్య సంబంధముగా సువార్తల రచయితలు ఒకరిపై మరొకరు ఆధారపడుటను సూచించును – ఇది పరిశుద్ధాత్మ చేత నడిపించబడు ఒక ప్రక్రియయై యున్నది. "చదువాడు గ్రహించుగాక" అను ప్రకటన నిశితదృష్టితో నిండియున్న విశ్వాసులు జాగరూకులై సముచితమైన చర్య తీసికొనునట్లు వారిని సవాలు చేయుచున్నది (చూడు దానియేలు 12:10; ప్రకటన 13:18).

**వచనము 16. యూదయలో** నుండిన విశ్వాసులు చేపట్టవలసి యుండిన చర్య ఏమిటో ఈ వచనము స్పష్టము చేయుచున్నది. రోమా ప్రభుత్వ సైనికులు వచ్చుచుండుట

వారు చూచునప్పుడు (లూకా 21:20), వారు తమ ప్రాణములను దక్కించుకొనునట్లు **కొండలకు పారిపోవలెను**. పాత నిబంధన కాలములో, ఇశ్రాయేలీయులు వారి శత్రువుల బారి నుంచి తప్పించుకొనుటకు కొండ గుహలలోను బండ సందులలోను దాగుకొన్నారు, తత్ఫలితంగా శత్రువులు కొండ ప్రదేశాల్లో వారిని జయించుటకు కష్టతరముగా నుండినది (చూడు న్యాయాధిపతులు 6:2; 1 సమూయేలు 13:6; 1 రాజులు 18:4; యెషయా 2:19, 20, 21; యిర్మీయా 49:30; యెహెజ్కేలు 7:15, 16; 33:27). పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య వ్యవధిలో, మక్కాబీయులకు విరోధముగా చేయబడుచుండిన తిరుగుబాటులో పాల్గొనుచుండినవారికి కొండలు సురక్షితముగా నుండుటకు ఒక స్థలమును సహితము సమకూర్చినవి.[6] ఈ సమయంలో, ఆయనను వెంబడించుచుండిన వారు కూడ కొండలకు పారిపోవలెనని యేసు ప్రభువు సెలవిచ్చాడు. ఈ హెచ్చరికను క్రెయిన్ ఎస్. కీనర్ మనకు ఈ విధంగా అన్వయింపజేయుచున్నాడు: "ఆయనను వెంబడించుచున్నవారు ఈ నాటి యుగములో ఎదురగుచున్న ఆపదలను వాస్తవికముగా అంగీకరించి సాధ్యమైనపుడెల్లా వాటి బారి నుంచి తప్పించుకొనవలెనని యేసు వారిని హెచ్చరించుచున్నాడు."[7]

సంఘ చరిత్రకారుడైన యుసిబియస్ ప్రకారము, క్రైస్తవులు యెరూషలేములో నుండి పారిపోయి చివరకు యొర్దానునకు ఆవల నున్న పెల్ల అను చోట స్థిరనివాసము లేర్పరచుకొన్నారు.[8] రోమా ప్రభుత్వ సైనికులు యెరూషలేము పట్టణమున ముట్టడించుటకు కొద్దిసేపటి క్రితం ఈ పలాయనము ప్రారంభమయ్యిందని ఎపిఫనెయ్యస్ చెప్పాడు.[9] ఏది ఏమైనా, పెల్ల సాంప్రదాయము గూర్చి కొందరు విద్వాంసులు తమ భేదాభిప్రాయములను వెల్లడించుచున్నారు.[10] వీటితో నిమిత్తము లేకుండా, యేసు సెలవిచ్చుచున్న ఇచ్చటి మాటలకును ఆయన రెండవ రాకడకును ఎవ్విధమైన సంబంధం లేదని ఉద్ఘాటింపబడవలెను. ఏలయనగా ఆ సమయంలో ఎవడును ఎవ్విధంగాను పలాయనము చిత్తగించజాలడు.

**వచనము 17.** ఒకడు తన ఇంటి మిద్దె మీద ఉన్నప్పుడు నాశనకరమగు హేయవస్తువు లేదా యెరూషలేము చుట్టుముట్టబడుటను చూచినట్లయితే, వాడు **తన యింటిలో నుండి ఏదైనను తీసికొని పోవుటకు క్రిందికి దిగకూడదని** యేసు ప్రభువు సెలవిచ్చాడు. పాలస్తీనా దేశంలో ఇంటి పైకప్పు సమతలముగా నుండినది. అది ధాన్యము ఎండబోయుటకు (యెహోషువా 2:6), విశ్రాంతి తీసికొనుటకు (1 సమూయేలు 9:25), కనిపెట్టి బయటికి చూచుటకు (యెషయా 22:1), మరియు ప్రార్థన చేసికొనుటకు (అపొస్తలుల కార్యములు 10:9) అనుకూలమైన చోటైయుండినది. వేసవి కాలంలో, ప్రత్యేకించి రాత్రివేళల్లో, అంతటి ఎత్తులో తమ శరీరములను స్పృశించుచుండిన చల్లని గాలులతో మిద్దెలపై అందరు ఆనందానుభూతిని అనుభవించుచుండిరి. సాధారణంగా నిచ్చెన సహాయంతో గాని లేదా ఇంటికి వెలుపటి భాగంలో ఉండిన మెట్ల మీది నుంచి గాని వారు మిద్దెల మీదికి వెళ్లుచుండిరి. ఒకడు మిద్దె మీది నుంచి దిగి ఇంటి లోనికి వెళ్లి మూట ముల్లె తీసికొనకుండానే వెళ్లిపోవలెనని యేసు చెప్పుచుండెను. మూట ముల్లె సర్దుకొనుటకు సమయం లేదు, సరికదా అదనంగా ఉన్న సామాను పలాయనము చిత్తగించుచున్నప్పుడు ఆటంకంగా ఉంటుంది. ఒకడు మిద్దె మీది నుండి క్రిందికి దిగుటకు బదులుగా, ఒక ఇంటి మిద్దె మీది నుంచి సమీపముననే ఉన్న మరొక ఇంటి మిద్దె మీదికి దూకుచు త్వరగా తప్పించుకొనవచ్చునని సూచింపబడినది.[11]

**వచనము 18.** అదే విధముగా, **పొలములో ఉండువాడు తన బట్టలు తీసికొనిపోవుటకు ఇంటికి రాకూడదని** యేసు సెలవిచ్చాడు. పూర్వకాలపు ప్రజలు తరచుగా వాటి చుట్టూర పెద్ద ప్రహరీ గోడలుండిన ప్రాంగణముల లోపలి ఇళ్లలో నివసించారు, కానీ పగటి వేళ్లల్లో వారు పొలములలో పనులు చేయుచుండిరి. ఒకడు పగటి ఎండ వేళలో పొలములో పనిచేయుచుండగా, తన "పైవస్త్రమును" (*himation*) లేక, "బట్టలను" ఇంటి యొద్ద విడిచిపెట్టవచ్చును. చల్లని వాతావరణములో ప్రయాణము చేయునప్పుడు ఈ పైవస్త్రము ఆవశ్యకమై యుండినది, సరికదా అది తరచుగా ఒకడు వెలుపల నిద్రించునప్పుడు నేల మీద పరుచుకొనుటకు పనికివచ్చినది (ద్వితియోపదేశకాండము 24:13; మత్తయి 5:40). ఈ మందలింపు, 17వ వచనములో నున్న మందలింపు కూడ, మౌలిక నిత్యావసరముల కంటే ఒకని ప్రాణమే ఎక్కువ ప్రాముఖ్యమైనదని సూచించుచున్నది.[12] ఒకడు తన పైవస్త్రమునకు గాని, ఇతర సొంత వస్తువులకు గాని మారుగా మరొకటి తెచ్చుకొనవచ్చును లేదా కొనుగోలు చేయవచ్చును కానీ వాని ప్రాణమునకు ప్రతిగా తెచ్చుకొనుటకు మరొకటి ఏదియును లేదు.

**వచనము 19**. వారి ఇళ్లను ఖాళీచేయించి వెలుపలికి తీసికొనివచ్చు విషయంలో **గర్భిణులను పాలిచ్చువారిని** తీసికొని వచ్చుట కష్టంగా ఉండును. ఈ స్త్రీలు సామాన్య స్త్రీల వలె కొండ ప్రదేశంలో వేగిరముగా నడువలేరు, మరియు అనారోగ్యమునకు లోనగుటకు వీరు ఎక్కువ అనువైనవారై యున్నారు. కాబట్టి, రోమా ప్రభుత్వ సైనికులు వీరిని అతి సులభంగా పట్టుకొనగలరు. ఈ పలాయన సమయంలో గర్భిణులకు గర్భస్రావము కలుగు అవకాశములు మెండు, మరియు పాలు త్రాగు శిశువులు వారి తల్లులు వారి కళ్ల ముందే చంపబడుట చూడవచ్చును.

పట్టణము లోపలనే నిలిచియుండిపోయిన యూదులైన స్త్రీలకు సహితము అవి ఆందోళనను కలిగించు కాలములై యుండును. సిలువ దిశగా పయనించుచుండిన యేసు, యెరూషలేము కుమార్తెలతో, "ఇదిగో, గొడ్రాళ్ళు కనని గర్భములును పాలియ్యని స్తనములును ధన్యములైనవని చెప్పుదినములు వచ్చుచున్నవి" అని చెప్పాడు (లూకా 23:29). నిస్సందేహముగా అయన మనస్సులో యెరూషలేము పట్టణము పట్టబడి నాశనము చేయబడు సంగతి మెదలుచునే యుండినది. ఆ రోజుల్లో, "మేడగదులు, కరవు మూలమున తమ ప్రాణాలు కోల్పోవుచుండిన స్త్రీలు మరియు పిల్లలతో నిండియుండినవని" జోసీఫస్ రచించాడు.[13] ఆకలి మంటలతో అలమటించుచుండిన ఒక అమ్మ తన ఆకలికి తట్టుకొనలేక, తన సొంత కుమారున్నే చంపుక తినిన ఒల్లు జలదరింపజేయు కథను కూడ జోసీఫస్ నివేదించాడు.[14]

**వచనము 20**. **మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతి దినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడని** పలుకుచు యేసు తన సంభాషణ కొనసాగించాడు. చలికాలములో ప్రయాణము చేయుట శీతలమైన శీతోష్ణస్థితి మూలమున కష్టతరముగా నుండును. తమ్మూజ్ నెలలో (జూన్/జులై), అది ఎండాకాలము మరియు తెబెత్ నెలలో (డిసంబర్/జనవరి), అది చలికాలం, కానీ నీసాన్ నెలలో (మార్చి/ఏప్రిల్) ప్రయాణాలు చేయుటకు సౌకర్యవంతమైన వాతావరణముండునని యూదా మతబోధకులలో ఒకరు ప్రకటించాడు.[15] శీతల ఉష్ణోగ్రతలకు అవల, పాలస్తీన దేశంలోని చలికాలములో ఆకస్మికముగా వర్షములు కుండపోతగా కురియుచు, ఏరులు నదులు ఉప్పొంగి పారుట

వలన వరదలు కూడ వచ్చుచుండినవి. కాబట్టి ఎండిపోయిన నదీతలములు నీళ్లతో నిండిపోయినవి, యొర్దాను నదీ జలాల మట్టము వరద సూచన మట్టమునకు చేరుకొనినది. కొండలపై ఏకధాటిగా కురిసిన వర్షముల తాకిడి వలన దొర్లివచ్చిన రాళ్లు, కొట్టుకువచ్చిన బురద కొన్ని రహదారుల్లో కూరుకుపోవుటనుబట్టి కాలినడక బహు కష్టముగా నుండినది.[16]

మత్తయి యూదులైన క్రైస్తవ విశ్వాసుల నుద్దేశించి తన సువార్తను వ్రాసినవాడు, సబ్బాతు దినాన ప్రయాణం చేయుటకు గల కష్టమును ఇతనొక్కడే తెలియజెప్పాడు. మిగిలిన సువార్తీకులు దీని గూర్చి పేర్కొనలేదు. యెరూషలేములోని క్రైస్తవులలో అనేకులు సబ్బాతు దినాన ప్రయాణము చేయుటకు ఆశించియుండకపోవచ్చును ఏలయనగా వారు యింకను ధర్మశాస్త్రమును పాటించుచుండిరి (అపొస్తలుల కార్యములు 15:1; 21:17, 20). సాంప్రదాయము ప్రకారముగా, యూదులు సబ్బాతు దినమున ఒక మైలు దూరములో మూడువంతుల దూరము మాత్రమే ప్రయాణము చేయుటకు కట్టుబడియుండిరి (అపొస్తలుల కార్యములు 1:12).[17] నెహెమ్యా దినములలో వలెనే, సబ్బాతు దినమున పట్టణము యొక్క ద్వారములు మూయబడినట్లయితే (నెహెమ్యా 13:19–22), ఆ నాడు క్రైస్తవులు పట్టణములో నుండి వెలుపలకు వెళ్లుట వారికి కష్టమై యుండవచ్చునని కొందరు సూచించారు. అమ్మకముదారులు తమ అంగళ్లను సబ్బాతు దినాన మూసివేయుదురు గనుక, విశ్వాసులు రొట్టె లేదా ఇతర ఆహార పదార్థములు కొనుగోలు చేయలేకపోయారు. అంతమాత్రమేగాక, యెరూషలేములోను, ఇతర స్థలములలోను అవిశ్వాసులై యుండిన యూదులు వారిని బహుశా హింసించియుండవచ్చును.

వచనము 21. అటుతరువాత యేసు ఒక గొప్ప శ్రమ గూర్చి వారిని హెచ్చరించాడు. ఈ పుడమి యొక్క "అంత్య దినములోని" ఏదో ఒక భవిష్యత్ కాలమును ఇది సూచించుట లేదు. కానీ విశేషంగా, రోమా సర్వసైన్యాధికారియైన తీతు యెరూషలేమును ముట్టడించుట, మరియు తత్ఫలితంగా యెరూషలేము నివాసుల మీదికి రానైయుండిన మహా శ్రమ మాత్రమేగాక, పట్టణముపై జరుగనున్న చిట్టచివరి దాడి గూర్చి పరోక్షంగా చెప్పుచున్నది.

**లోకారంభము నుండి ఇప్పటి వరకు అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పుడును కలుగబోదు** అంటూ, యేసు కలుగబోవుచుండిన విధ్వంసమును వివరించాడు. యెరూషలేము పట్టణము యొక్క ఈ వినాశము, నోవహు దినములలో వచ్చిన జలప్రళయము లేక మోషే కాలములో పీడించిన పది తెగుళ్ల కంటే ఘోరమైనదై యుండినదా? భవిష్యత్తులో ఎప్పుడైనా జరిగే ఏ యుద్ధము కంటెను ఈ శ్రమ గొప్పదై యుండినదా? ఇచ్చట ప్రయోగింపబడుచున్న భాష హీబ్రూ మరియు అరబీ భాషలు కలిసియున్న దాని అతిశయోక్తియని అర్థంచేసుకొనుట యుక్తము (చూడు యిర్మీయా 30:7; దానియేలు 12:1; యోవేలు 2:2). ఈ సూచన తీర్పు దినమునకు ముందుఛాయగా నున్న యెరూషలేము పట్టణ నాశనము యొక్క పరిమాణమును తక్కువగా అంచనా వేయుటకు ఉద్దేశింపబడినది కాదు.

జోసీఫస్, ఈ సంఘటనలకు ప్రత్యక్ష సాక్షియైయున్నవాడు, సంభవించిన విధ్వంసము గూర్చి ఇదే విధమైన మాటల్లో వర్ణించుచున్నాడు:

> నాకు అగుపించుచున్న దాని ప్రకారంగా, ఈ మనుష్యులందరి దురదృష్టములు, లోకము పుట్టినది మొదలుకొని ఒక వేళ అవి ప్రస్తుతము యూదులెదుర్కొనుచున్న విధ్వంసముతో పోల్చబడగలిగినట్లయితే, అవి ఉన్నట్టుగానే అంతగా చెప్పుకోదగినవి కావు.[18]

సరికదా, ఈ పట్టణము అనుభవించినంతటి దుఃఖకరమైన దురవస్థను ఇతరమైన ఏ పట్టణమైనను … . లోకము పుట్టినది మొదలుకొని, అనుభవించలేదు.[19]

అదే ప్రకారంగా అచ్చోట నశించిన జనసమూహములోని జనసంఖ్య మానవులుగాని లేదా దేవుడుగాని ఈ లోకములో కలుగజేసిన వినాశములన్నిటిలో నశించిన వారి సంఖ్యను మించిపోయినది.[20]

ఈ ముట్టడి మరియు యెరూషలేము నాశనము ఫలితంగా 1,100,000 మంది మరణించారనియు, 97,000 మంది చెరపట్టబడిరనియు ఈయన సాధికారపూర్వకంగా చెప్పుచున్నాడు. పేర్కొనబడిన ఈ సంఖ్యలో అధిక శాతం పస్కా పండుగ నాచరించుటకు యెరూషలేము పట్టణమునకు వచ్చిన యూదీయ యాత్రికులై యుండిరి. మిగిలినవారు యెరూషలేము పట్టణ వాస్తవ్యులై యుండిరి.[21]

**వచనము 22. ఆ దినములు తక్కువ చేయబడకపోయిన యెడల ఏ శరీరియు తప్పించుకొనదని** యేసు ప్రభువు సెలవిచ్చాడు. రోమా సైన్యము యెరూషలేము పట్టణమును కొంత కాలము వరకు చుట్టుముట్టి యుండినను, దాడులు ఏప్రిల్ మాసము మొదలుకొని సెప్టెంబరు మాసము వరకు మాత్రమే కొనసాగినవి. ఈ ముట్టడి దినములు **ఏర్పరచబడినవారి నిమిత్తము** తక్కువ చేయబడినవి. "ఏర్పరచబడిన వారు" అను పదము క్రైస్తవులను సూచించుచున్నది (22:14పై గల వ్యాఖ్యనము చూడు). లియోన్ మోర్రిస్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు: "దేవుని ప్రజలు వారి చుట్టూర నున్న ఇతర ప్రజలపై దేవుని కనికరము కుమ్మరింపబడుటకు హేతువౌదురు; మారుమనస్సు నొందనివారు అంతిమ రక్షణలో పాలుపంచుకొనరు, అట్లయినను ఏర్పరచబడినవారు వారి సమాజములలో ఉండుటనుబట్టి వారికి ఎంతో కొంత మేలు కలుగును."[22] ఈ విధ్వంసములో ఒక్క క్రైస్తవ విశ్వాసియైనను మరణించలేదనియు, ఏలయనగా వారు యేసుక్రీస్తు ఆదేశములను విన్నారు, విశ్వాసించారు మరియు విధేయులయ్యారనియు ఆది సంఘ చరిత్రకారులు చెప్పుచున్నారు.[23]

## అబద్ధపు క్రీస్తులను నమ్మవద్దు
## (24:23-28)

**23ఆ కాలమందు ఎవడైనను - ఇదిగో క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నాడు అని చెప్పినయెడల నమ్మకుడి. 24అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనపరచెదరు. 25ఇదిగో ముందుగా నేను మీతో చెప్పియున్నాను. 26కాబట్టి ఎవరైనను-ఇదిగో అరణ్యములో ఉన్నాడని మీతో చెప్పినను వెళ్లకుడి-ఇదిగో లోపలి గదిలో ఉన్నాడని చెప్పినను నమ్మకుడి 27మెరుపు తూర్పున పుట్టి పడమటివరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును. 28పీనుగు ఎక్కడ ఉన్నదో అక్కడ గద్దలు పోగవును.**

**వచనము 23.** యెరూషలేము పట్టణము నాశనమగుచుండు సమయంలో ఆయన తిరిగి రాడని యేసు సుస్పష్టము చేసాడు. ఈ కాలములో మెస్సీయా వేషభాషలు ధరించిన

కపటులు లేతురు, యూదీయ ప్రజలకు విడుదల కలిగించుదురని వారు అభయమిచ్చెదరు. ఏది ఏమైనా, యేసు అనుచరులు వారి గూర్చిన వదంతులు వినకూడదు. **ఇదిగో, క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, లేక అక్కడ ఉన్నాడు** అని వారు సాధికారంతో చెప్పుచుందురు. ఈ నివేదికలు అబద్ధ ఆశలపై ఆధారపడును, వాస్తవముపై కాదు. ఇటువంటి అబద్ధములను పట్టించుకొనకూడదని యేసు తన శిష్యులతో చెప్పాడు. **నమ్మకుడి** అను ఆజ్ఞ 26వ వచనంలో పునఃరుక్తము గావింపబడినది: "నమ్మకుడి."

**వచనము 24**. **అబద్ధపు క్రీస్తులు మరియు అబద్ధపు ప్రవక్తలు** వారు సాధికారంతో చెప్పుచుండు మాటలను **గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను** కనపర్చుట ద్వారా బలపర్చుకొందురు. ఇవి ప్రజలను మోసపుచ్చుటకు ఉద్దేశింపబడిన అబద్ధపు అద్భుత కార్యములై యుండును, సమరయుల మధ్య గారడీవాడైన సీమోనను నొక మనుష్యుడు చేసినట్లే యుండును (అపొస్తలుల కార్యములు 8:9–11). ఈ సూచక క్రియలు మరియు మహత్కార్యములు **ఏర్పరచబడిన వారిని** సహితము, అనగా, క్రైస్తవులు సహితము, **మోసపరచబడునంతగా** బలవంతము చేయునవై యుండగలవు.

**వచనము 25.** యేసు, **ఇదిగో, ముందుగా నేను మీతో చెప్పియున్నాను** అని విద్యుక్తంగా వాగ్దానము చేసాడు. వారిని ముందుగానే సంసిద్ధము చేయునట్లు యేసు భవిష్యతులో సంభవింపనై యుండిన ఆపదల గూర్చి తన శిష్యులను తరచుగా హెచ్చరించాడు (10:16–39; 16:21; 17:22, 23; 20:17–19; 26:1, 2). పరిస్థతులు వారిని ఎంత కఠినమైన ఇక్కట్టుల పాలుజేయునవై యున్నప్పటికిని, వారు ఆయన పట్ల నిశ్చయముగా విశ్వసనీయమైన విధేయులై యుండునట్లు ఆయన ఈ పని చేసాడు.

**వచనము 26.** క్రీస్తు **అరణ్యములో** ఉన్నాడను వార్తలను వారు పట్టించుకొనకూడదని ఆయన తన శిష్యులతో చెప్పాడు. జోసీఫస్ ప్రకారము, అది నాశనము కాక మునుపటి రెండు దశాబ్దముల కాలములో, యెరూషలేములో (మరియు పాలస్తీనాలో) అనేక మంది అబద్ధపు ప్రవక్తలుండిరి. ప్రజలు వారి వెంట అరణ్యము లోనికి, వారు దేవుని నుండి కలుగుచున్నవని చెప్పుకొనబడు సూచక క్రియలను మరియు మహత్కార్యములను చేయు స్థలములోనికి, వచ్చునట్లు వారు ప్రజలను బలవంతము చేయుచుండిరని ఈయన రచించాడు.[24]

మెస్సీయా అరణ్యము లోనికి వచ్చునను ఒక సామాన్యమైన ఎదురుచూపు ప్రజల మనస్సుల్లో ఉండినది (చూడు అపొస్తలుల కార్యములు 21:38). ఎంతో గొప్ప జనసమూహము బాప్తిస్మమిచ్చు యోహాను యొద్దకు ఎందుకు వచ్చారో, ఆతడే క్రీస్తై యున్నాడేమో చెప్పవలెనని యూదీయ నాయకులు అతనిని ఎందుకు ప్రశ్నించారో, ప్రజాదరణ పొందిన ఈ నమ్మకము వివరించును (3:1, 5; 11:7; యోహాను 1:19–28). రిచర్డ్ ఏ. హోర్స్లి మరియు జాన్ ఎస్. హ్యాన్సన్ ఇలా రచించారు.

> బహు గొప్ప జనసమూహము, సంభవింపనై యుండిన దేవుని కార్యముల ద్వారా ప్రేరేపింపబడి, ఒప్పింపబడినవారై, కృపావరములు కలిగియుండిన వారి నాయకులను వెంబడించుటకు వారి పనులను మానుకొని, ఇళ్లను విడిచి, గ్రామముల నుండి బయటకువచ్చి, అరణ్యము లోనికి చేర్చుకొన్నారు. దేవుడు అంతకు పూర్వపు కాలములలో, విమోచనా సంబంధమైన సూచన క్రియలను మరియు మహత్కార్యములను చేసిచూపినది అరణ్యములోనే అనియు, పవిత్రీకరణము, సిద్ధపాటు, మరియు పునఃరుజ్జీవనం కలిగించు

స్థలము అరణ్యమే అనియు పవిత్రమైన వారి సాంప్రదాయముల ద్వారా వారు ఎరిగి యుండిరి.[25]

యూదా మతోపదేశకుల సాహిత్యములో మెస్సీయా, యూదా దేశ అరణ్యములో లేదా యొర్దానుకు ఆవల అగుపించనై యుండిన రెండవ మోషేగా చిత్రీకరింపబడి యున్నాడు.[26]

**వెళ్లవద్దు** అని యేసు తన అనుచరులతో చెప్పాడు. అనగా, "అబద్ధపు మెస్సీయాలను అనుసరించుటకు అరణ్యములోనికి వెళ్లవద్దు" అని ఆయన చెప్పుచుండెను. ఇటువంటిదే మరొక సందర్భములో, యేసు, "వెళ్లకుడి, వెంబడింపకుడి" అని సెలవిచ్చాడు (లూకా 17:23).

అరణ్యముతో పాటు, ఈ కపటపు క్రీస్తులు **లోపలి గదులో** అగుపించుదురని యేసు పేర్కొన్నాడు. లోపలి గదులు ఒక ఇంటిలోపల ఒకడు సామాన్య ప్రజానీకమునకు అగుపించకుండునట్లు దాగుకొనుటకు ఏకాంతమును, భద్రతనిచ్చునవైన స్థలములై యుండెను. ఇదే అర్థము నిచ్చు గ్రీకు పదము *tameion* మత్తయి వ్రాసిన సువార్తలో ఇంతకు మునుపు తండ్రికి రహస్యముగా ప్రార్థన చేయుటకు ప్రత్యేకించుకొనబడు స్థలము పేర్కొనబడిన సందర్భములో అగుపించినది (6:6పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 27.** అబద్ధపు ప్రవక్తలు చేయు మోసపుచ్చు సూచక క్రియలు మరియు మహత్కార్యములకు తారతమ్యముగా, యేసు తన రెండవ రాకడకు సంబంధించిన ఒక వాస్తవమైనది మరియు విదితమునైన వర్ణన నిచ్చాడు: **మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును.** ఆయన రాకడ (*parousia*) ఒక అంధకారమయమైన స్థలములో లేదా రహస్యముగా జరగదు, కానీ అది ప్రతి ఒక్కరి కంటికి స్పష్టముగా కనబడును. ఆకాశము క్రింద ఒక దిక్కు నుండి మెరుపు మెరిసినట్లుగా (లూకా 17:24) ఆయన రాకడ వేగవంతమును, ప్రకాశవంతమైనదియునై యుండును. "ఇదిగో, ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు, ప్రతి నేత్రము ఆయనను చూచును" అని పరిశుద్ధుడైన యోహాను రచించాడు (ప్రకటన 1:7). ఈ వాంగ్మూలము యేసు ప్రభువు మత్తయి 24:30లో ముందుగా తెలియజెప్పిన వివరము వలె నున్నది.

**వచనము 28. పీనుగు ఎక్కడ ఉన్నదో, అక్కడ గద్దలు పోగవును** అను ఒక ప్రాచీన లోకోక్తితో, ఆయన తన రాకడ గూర్చి ఒకడు పొరబడుజాలడను లక్షణమును యేసు నొక్కివక్కాణించుచున్నట్లు అగుపించుచున్నది (చూడు లూకా 17:35-37). గద్దలు/రాబందులకు సంబంధించినది ఇటువంటిదే మరొక వాంగ్మూలము యోబు 39:30లో అగుపించును: "హతులైనవారు ఎక్కడ ఉందురో, అక్కడనే అది యుండును." హెబ్రీ పదము *nesher* మరియు గ్రీకు పదము *aetos*, ఈ రెండును "గద్ద" అని గాని "రాబందు" అని గాని అనువదింపబడవచ్చును.

"పీనుగు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*ptōma*) దౌర్జన్యపూరితముగా హతమార్చబడిన వానిని సూచించుచున్నది (14:12పై వ్యాఖ్యానము చూడు). మృత దేహములు, తరచుగా రణరంగములో నేలరాలిన దేహముల భయంకరమైన విధికృతమును పేర్కొనుచు, అవి పక్షులచేతను కుక్కల చేతను తినివేయబడుట గూర్చి ప్రాచీన గ్రంథ పాఠములు తరచుగా పేర్కొనుచున్నవని కీనర్ సూచించుచున్నాడు.[27] డొనాల్డ్ ఏ. హేగ్నర్ 28వ వచనము

యొక్క అర్థమును ఈ విధంగా దండాన్వయము చేసాడు: “ఈ విధంగా ఎక్కడైనా ఒక చోట రాబందులు పోగయ్యాయంటే అక్కడ ఒక మృతదేహమున్నదని నీవు ఎలాగైతే ఖచ్చితంగా తెలుసుకుంటావో, అలాగే మనుష్యకుమారుని రాకడను నీవు తెలిసికొనకుండా ఉండజాలవు.”[28]

28వ వచనమును క్రీస్తు రెండవ రాకడతో ముడిపెట్టుటకు బదులుగా, కొంత మంది పండితులు దానిని రూపకాలంకారముగా అనువదించుచున్నారు. “పీనుగు” అను పదము దాని అంతిమ మరణ వేదనతో క్షీణించిపోవుచున్న ఇశ్రాయేలు జనాంగమును సూచించుచున్నదని వారు నమ్ముదురు. ఏది ఏమైనా, “రాబందులు” అను పదము సూచించుచున్న దాని గూర్చిన ఏకాభిప్రాయము లేదు. అవి ఆపత్తులో చిక్కుకొని యెరూషలేము ప్రజానీకమును చివరి గడియల్లో అసాధారణమైన దండనకు గురిచేసిన అబద్ధపు ప్రవక్తలు మరియు అబద్ధపు క్రీస్తులను సూచింపవచ్చును. “గద్దలు” అను ప్రత్నామ్నాయ అనువాదమును ఉపయోగించుకొనుచు, ఈ పక్షులు, ఒక గద్ద వోలె పట్టణము లోనికి కవాతుగా చొచ్చుకొనివచ్చిన రోమా ప్రభుత్వ సైనికదళములకు సంకేతములై యున్నవనునది మరొక ఎంపికయై యున్నది. ఇక చివరగా, ఈ తస్కరులు యెరూషలేము పట్టణము నాశనము చేయబడిన పిమ్మట దానిని దోపిడీ చేయుటలో పాల్గొనిన చుట్టుప్రక్కల ప్రదేశాల్లోని ప్రజలకు సాదృశ్యముగా నున్నవి. ఈ అనువాదములు అసాధ్యమైనవి కాకపోయినను, అవి సంభావ్యము కానివిగా కనబడుచున్నవి.

## మనుష్యకుమారుని సూచన కనబడును
## (24:29-31)

**[29]ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశమునుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును. [30]అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమిమీదనున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు. [31]మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును వారు ఆకాశముయొక్క ఈ చివరనుండి ఆ చివర వరకు నలుదిక్కులనుండి ఆయన ఏర్పరచుకొనినవారిని పోగుచేతురు.**

24:29-31 వరకు గల వచనములను యెరూషలేము పతనము గూర్చిన ప్రత్యక్షీకరణ వర్ణనగా మనము అనువదించవలెనా? అత్యంత అలంకారయుక్తమైన స్వభావముగల ఈ వాక్యభాగము యెరూషలేము పట్టణము పతనమగు సమయంలో కలుగు మహా శ్రమ మరియు నాశనమును వ్యక్తము చేయుచున్నదని ఈ దృష్టికోణముగలవారు సూచించుచున్నారు. బబులోను దేశ పతనము (యెషయా 13:10, 19), ఎదోము దేశ పతనము (యెషయా 34:4), మరియు ఐగుప్తు ఆపదలు (యెహెజ్కేలు 32:7, 8) గూర్చిన వర్ణనలు ఇదే విధమైన ప్రత్యక్షీకరణ పటములు కలిగియున్నవి. ఈ వాక్యభాగమునకు యేసు క్రీస్తు రెండవ రాకడతో సంబంధమును జోడించుట అవసరము లేదని ఈ దృష్టికోణముగలవారు చెప్పుచున్నారు. ఇంకా, ఈ వాక్యభాగము యెరూషలేము పతనమును

ప్రస్తావించుచున్నట్లయితే, కొనసాగుచుండు ఆలోచనల పరంపర 34వ వచనముతో సరిపడుచున్నది, ఇది యెరూషలేము పతనమును మరియు యేసు క్రీస్తు రెండవ రాకడను విభజించుచున్న ఒక సహజ ప్రకటనగా అగుపించుచున్నది.

అలా అయినప్పటకీ, 24:29–31ని యేసు క్రీస్తు రెండవ రాకడతో సంబంధము కలుపుచున్న దృక్పథము ఎంతో హర్షనీయమైన విషయముగలదై యున్నది. దీనికి ముందటి వచనములలో (24:27, 28) ఆయన రాకడ ఏ ఒక్కరైనను కోల్పోజాలని తరుణముతో కూడిన ఒక సంఘటనయై యున్నదని యేసు దాని గూర్చి వర్ణించాడు; ఆ సంఘటనను అందరు తమ కళ్లారా చూస్తారు. ఇంకా ఇతర వాక్యభాగములలో వర్ణింపబడినట్లుగా, "దేవదూతలు," "ఒక గొప్ప బూర," మరియు "ఏర్పరచబడిన వారు" క్రీస్తు రెండవ రాకడలో కీలకమైన విషయాలై యున్నారు. మెస్సీయా రాకడ గూర్చి వారు విననై యుండిన అబద్ధ వార్తలకు తారతమ్యముగా, ఆయన శిష్యులు సత్యమును తెలిసికొనినవారై యుండవలెనని యేసు ఆశించాడు.

**వచనము 29. వెంటనే** (*eutheōs*) అను క్రియావిశేషణము కష్టమైనదిగా ఉన్నది. స్పష్టంగా, ఈ వచనములో పేర్కొనబడిన సంఘటనలు (చీకటి **సూర్యుని** కమ్మును, **చంద్రుడు** కాంతిని ఇయ్యడు, ఆకాశము నుండి **నక్షత్రములు** రాలును) యెరూషలేము పట్టణము అనుభవించిన మహా శ్రమ అనంతరము అక్షరాలా సంభవించలేదు. అంతమాత్రమేగాక, ఆ కాలములో క్రీస్తు తిరిగి రాలేదు, మరియు ఆయన యిప్పటికిని – రెండు వేల సంవత్సరములు గతించినను – తిరిగి రాలేదు.

ఈ సందర్భములో అనేక అంశముల గూర్చి ఆలోచించవలసిన అవసరమున్నది: (1) "వెంటనే" అను పదము 36వ వచనమును దృష్టిలో ఉంచుకొని అనువదించబడవలెను, ఆయన రాకడ సమయమును "తండ్రి మాత్రమే ఎరుగును" కానీ "యే మనుష్యుడైనను ... ఎరుగడు" అని యేసు చెప్పిన వివరము ఆ వచనములో కలదు. సంఘటనలు సంభవించు నిర్ణీతమైన కాలము గూర్చి 29వ వచనంలో ఆయన ఖచ్చితంగా చెప్పడంలేదని ఈ ప్రకటన సూచించుచున్నది. (2) ఈ వచనములో ప్రత్యక్షీకరణ సంబంధమైన అలంకారిక దృష్టాంతము కలదు, బహుశా ఇది అక్షరార్థముగా తీసికొనబడకూడదు. దీనికి సంబంధించిన ఉదాహరణము అపొస్తలుల కార్యములు 2:15–21లో కలదు. ఆ వాక్యభాగములో, యోవేలు గ్రంథం, 2వ అధ్యాయంలోని ప్రవచనము – ఇదే విధమైన అలంకారిక దృష్టాంతము కలిగియున్న ప్రవచనము – పెంతెకొస్తు దినాన నెరవేరినదని పేతురు సెలవిచ్చిన విషయము కలదు. చీకటి, అక్షరాలా సూర్యుని కమ్ముకొనక పోయినప్పటికిని, అక్షరాలా చంద్రుడు కాంతి నియ్యకపోయినప్పటికిని, ఇది నిజమై యుండినది. (3) "వెంటనే" అను పదము "ప్రవచనాత్మకమైన ముందటి అపర్యాప్తము" అని పిలువబడిన ఒక విశేష లక్షణముగా అగుపించుచున్నది. ఈ రెండు సంఘటనలు ఒకదానికొకటి సమీపముగా నున్నవని ప్రవక్తలు కొన్ని పర్యాయములు వర్ణించారు కానీ వాస్తవమునకు అవి ఎంతో ఎడముగా నున్నవి. యెరూషలేము దేవాలయము విధ్వంసము చేయబడుట మరియు యుగ సమాప్తము ఈ అధ్యాయములో కలిపి చర్చింపబడినవను వాస్తవము ఈ రెండింటి మధ్య సన్నిహితమైన వేదాంతశాస్త్ర సంబంధమున్నదని సూచించుచున్నది. ఈ రెండును యేసు క్రీస్తు పరిచర్య యొక్క నెరవేర్పులై యున్నవి. ఈ రెండింటిలోను, దేవుని ప్రజలకు యేసే

దేవుని నిజమైన మరియు అంతిమ సందేశమై యున్నాడనునది నిజమని నిరూపించు తీర్పు పేర్కొనబడినది.[29]

**వచనము 30.** "నీ రాకడకు ... *సూచన లేవి?*" అని ఆయన శిష్యులు యేసునడిగారు (24:3). ఈ అధ్యాయము ఆరంభములో గల ఆ ప్రశ్నకు యేసు ఈ సందర్భంలో సమాధానమిచ్చుచున్నాడు: **మనుష్యకుమారుని సూచన** అదే రెండవ రాకడయై యుండును. అది ఆకస్మికమును, మనము అనుకొనని గడియయే అయినా, దేవుడు ఏర్పరచిన సమయంలో క్రీస్తు వచ్చును. అబద్ధ క్రీస్తులు అరణ్యములో మరియు లోపలి గదుల్లో ఉన్నట్టి రహస్యము వలె గాక, ఆయన రాకడ ప్రతి ఒక్కరికి దృశ్యమైనదిగాను వారి వీనులకు విందు చేయునదిగాను ఉండును (మార్కు 13:26; లూకా 21:27; 1 థెస్సలొనీకయులకు 4:16; ప్రకటన 1:7). ఆయన రాకడ కొరకు సిద్ధముగా లేని భూనివాసులందరు ఆయన సన్నిధి ప్రస్నతనుబట్టి **రొమ్ము కొట్టుకొందురు. భూమి మీద నున్న సకల గోత్రములవారిలో** నిశ్చయముగా ప్రభువు రాకడ కొరకు మెలకువగా ఉండి ప్రార్థన చేయుచుండువారు కలుపబడలేదు (చూడు 1 కొరింథీయులకు 16:22; 2 తిమోతి 4:8). ఆయన రాకడ **ప్రభావము** మరియు **మహా మహిమకు** ఒక ప్రదర్శనయై యుండును. **మనుష్యకుమారుడు ఆకాశ మేఘారూఢుడై వచ్చు** సన్నివేశము దానియేలు 7:13, 14లో నుండి అరువుతెచ్చుకొనబడినది, అది క్రీస్తు యొక్క అధికారమును మరియు యేలుబడిన ఉద్ఘాటించుచున్న వాక్యభాగమై యున్నది.

**వచనము 31. ఒక గొప్ప బూర** ఊదబడుట ద్వారా చేయబడు శబ్దము రానైయున్న తీర్పునకు ఒక హెచ్చరిక యని అనువదింపబడినది; ఏది ఏమైనా, ఆ సమయానికి, ప్రజలు మారుమనస్సు నొందుటకు అది చాలా ఆలస్యమైనదై యుండును. గనుక దానికి బదులుగా, బూర నీతిమంతులను పోగుచేయుటకు ఊదబడును (చూడు యెషయా 27:13). "... బూర మ్రోగును, అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురని" పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీయులకు 15:51, 52); "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను, పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును, క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు" (1 థెస్సలొనీకయులకు 4:16).

*Shopar* మరియు *ch$^{a}$tsots$^{e}$rah* అను హెబ్రీ పదములను అనువదించుటకు సెప్టువజింట్‌లో "బూర" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*salpinx*) వాడబడినది. *shopar* అనునది అతి సామాన్యముగా ఒక గొఱ్ఱె పోతు కొమ్ము అయియుండినది, మరియు *ch$^{a}$tsots$^{e}$rah* అనునది ఒక పొడుగాటిది, వంపులేకుండా తిన్నగా ఉన్నది, చివరలో ఉబ్బిపోయినట్లుగా వెడల్పుగా నుండిన లోహపు గొట్టమై యుండినది.[30] ఈ సమయంలో మనము ఈ రెండు సాధనములను దృష్టిలో ఉంచుకొనవచ్చును.

**ఆయన దూతలు ఆయన ఏర్పరచుకొనిన వారిని పోగుచేతురని** యేసు సెలవిచ్చాడు. దేవుని యెడల విశ్వసనీయులై యున్నవారిని పోగుచేయుటకు దూతలను పంపుటకు ఆయన అధికారము కలిగియున్నాడను వాస్తవములో ఆయన దేవత్వము అగుపించుచున్నది. యుగ సమాప్తి యందు నీతిమంతులను దుర్మార్గుల నుండి వేరుచేయుటకు ఆయన దూతలు ఆయన ప్రతినిధిలుగా పనిచేయుదురని కూడ యేసు గురుగులు మరియు చేపల వల గూర్చిన ఉపమానములలో పేర్కొన్నాడు (13:41, 42, 49, 50).

ఆకాశము యొక్క నలు దిశల నుండి పోగుచేయబడుటకు ఏర్పరచబడినవారు వారే నని

యూదులు నమ్మారు (ద్వితీయోపదేశకాండము 30:4; యెషయా 11:12; 43:5; 49:5; 56:8).[31] 'షెమొనెహ్ ఎ[స్రెహ్' (పదునెనిమిది దీవెనలు) అని పిలువబడిన యూదీయ ప్రార్థనలో ఈ ఎదురుచూపు ప్రతిబింబించబడియున్నది. "మన స్వాతంత్రమునుబట్టి గొప్ప బూర ఊదుడి, దేశబహిష్కృతులైన మన ప్రియులు ఆకాశము యొక్క ఈ చివర నుండి వరకు నలుదిశల నుండి పోగుచేయబడి మనతో సమైక్యమగునట్లు ధ్వజము నెత్తుడి. చెదిరిపోయిన ఆయన ప్రజలైన ఇశ్రాయేలీయులను తిరిగి పోగుచేయనైయున్న దేవా, నీకు స్తోత్రం!" అని పదవ దీవెన సెలవిచ్చుచున్నది. 31వ వచనములో గల "ఏర్పరచుకొనినవారు" అను పదము, పాత నిబంధన క్రింద జీవించిన విశ్వసనీయులైన ఇశ్రాయేలీయులు వీరిలో కలుపబడి యున్నారని సూచించుచుండగా, అది క్రొత్త నిబంధన క్రింద జీవించుచున్న విశ్వసనీయులైన క్రైస్తవులను నిశ్చయముగా సూచించుచున్నది. యేసును వెంబడించుచున్నవారిని సూచించుటకు ఈ పదము ఇదే అధ్యాయంలో యింకా రెండు పర్యాయములు ప్రయోగింపబడినది (24:22, 24).

ఏర్పరచుకొనినవారిని దూతలు **నలుదిక్కుల నుండి** పోగుచేయుదురు. భూలోకమంతటిని, దిక్సూచి లోని నాలుగు దిశలను సూచించుటకు ఇదొక ప్రాచీన విధానమై యుండినది (చూడు యిర్మీయా 49:36; యెహెజ్కేలు 37:9; దానియేలు 7:2; 8:8; జెకర్యా 2:6; ప్రకటన 7:1). అది **ఆకాశము యొక్క ఈ చివర నుండి ఆ చివర వరకు** అని అర్థమిచ్చుచున్నది.

### యెరూషలేము ఈ తరములోనే నాశనమగును (24:32-35)

**32అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము నేర్చుకొనుడి. అంజూరపుకొమ్మ లేతదై చిగురించునప్పుడు వసంత కాలము యింక సమీపముగా ఉన్నదని మీకు తెలియును. 33ఆ ప్రకారమే మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే, ద్వారముదగ్గరనే యున్నాడని తెలిసికొనుడి 34ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. 35ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు.**

**వచనము 32.** స్పష్టముగా, ఈ పరిస్థితిలో, యేసు మరలా యెరూషలేము నాశనము గూర్చిన అంశమునకు మళ్లాడు. ఆయన **అంజూరపు చెట్టు** గూర్చి చేయుచున్న సోదాహరణ చిత్రీకరణము స్పష్టముగా నున్నది. మారుచున్న కాలములను ప్రజలు సృష్టిలో అగుపించు కొన్ని నిశ్చయమైన సూచనల ద్వారా నిర్ధరించుకొనగలరని ఆయన అంగీకరించుచుండెను. వసంత ఋతువులో, అంజూరపు చెట్టులోని పోషక రసము అధికమగును, **దాని కొమ్మలు లేతవగును. దాని ఆకులు** అంకురించుట **ఎండాకాలము సమీపముగా** నున్నదనుటకు ఒక నిదర్శనమై యుండినది (21:19పై గల వ్యాఖ్యానము చూడు). సృష్టిలో అగుపించు సూచనలను గమనించుచు వాటి ఆధారంగా ఋతువులను నిర్ధరించగల మానవులు, సంభవింపనై యుండిన యెరూషలేము నాశనమును సూచించు ఆధ్యాత్మిక సూచనలను గ్రహించగలవారై యుందురని క్రీస్తు తెలియజెప్పుచుండెను.

**వచనము 33. ఆ ప్రకారమే మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు ఆయన**

**సమీపముననే, ద్వారము దగ్గరనే యున్నాడని తెలిసికొనుడి** అని యేసు తన శిష్యులతో చెప్పాడు. "ఆయన సమీపముననే యున్నాడని" అర్థమునిచ్చు NASBలో వ్రాయబడి యున్న పదజాలము, ఈ వచనము క్రీస్తు యొక్క రెండవ రాకడ గూర్చిన ప్రస్తావనయై యున్నదని అగుపించునట్లు చేయుచున్నది. ఇది NLT అనువాదము చేత మరింత విదితము గావింపబడినది, "ఆయన తిరిగి వచ్చుట అతి సమీపముగా నున్నదని" ఆ అనువాద అర్థమై యున్నది. మౌలిక గ్రంథపాఠమును "అది సమీపముగా నున్నది" (KJV; NIV) లేక "కాలము సమీపముగా నున్నది" (JNT) అని అనువదింపవచ్చును. ఈ అనువాదము సందర్భమునుబట్టి దాని ఉత్తమమైన మద్దత్తును కూడగట్టుకొనుచున్నది. "అది" – NASB అనువాదము – అను పదము, యెరూషలేము పతనమైన సమయము, "ఎండకాలము"ను (24:32) సూచింపవచ్చును.[32] జోసీఫస్ ప్రకారము, యెరూషలేము దేవాలయము క్రీ.శ. 70లో ఏబ్ మాసము (జులై/ఆగస్టు), పదవ నాశనము చేయబడినది.[33]

**వచనము 34.** ఇంకా, **ఇవన్నియు జరుగు వరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను** అని కూడ యేసు తన శిష్యులతో చెప్పాడు. ఈ వచనమును ఏమని వివరించవచ్చును? దాని అనువాదము "ఇవన్నియు" మరియు "తరము" అను పదముల అర్థముపై ఆధారపడియున్నది. "తరము" (*genea*) అను మాట "ఈ ప్రజలు," అనగా, యూదీయ జాతి అని అర్థమిచ్చునట్లు మనము అనువదించవచ్చునా? ఈ దృక్పథముగల వారు, ఆయన రాకడకు మునుపు యూదీయ జాతి అంతమొందునని యేసు వాగ్దానము చేయుచుండెనని నమ్ముదురు. ఏది ఏమైనా, జాక్ పి. లూయిస్ ఇలా సూచించుచున్నాడు,

> *Genos* (జాతి) మరియు *genea* (తరము) మధ్య ఒక తారతమ్యమున్నది ... మత్తయి వ్రాసిన సువార్తలో మరొక చోట నున్న *genea* అను పదము, ఆ సమయంలో, సాధారణంగా యేసు కాలములో, సజీవులై యున్న ప్రజలు అని అర్థమిచ్చుచున్నది (1:17; 11:16; 12:39, 41, 45; 23:36; మార్కు 8:38; లూకా 11:50f.; 17:25), మరియు నిస్సందేహముగా ఇచ్చట కూడ అదే అర్థము నిచ్చుచున్నది. యెరూషలేము దేవాలయ పతనము ఒక తరము గతింపక మునుపు సంభవించును.[34]

34వ వచనములోని "ఇవన్నియు" (విస్తరించిన సందర్భము సూచింపబడనట్లయితే) సహజంగానే 33వ వచనములోని అవే "విషయములను" సూచించుచున్నది. అనగా, ఈ గ్రంథ పాఠములో ఇంతకు మునుపు వర్ణింపబడిన సంఘటనలు నెరవేరునని దీని అర్థము. "ఇవన్నియు" అను పదము యొక్క ఆరంభము ఈ అధ్యాయము ఆరంభములో అగుపించును, అచ్చట యేసు దేవాలయము నాశనము మరియు "ఇవి" ఎప్పుడు జరుగును? అని శిష్యులడిగిన ప్రశ్నకు (24:2, 3) సమాధానమిచ్చుచు ముందుగానే తెలియజెప్పిన ప్రవచనముతో ప్రభువు యొక్క ఉపన్యాసము ఆరంభమయ్యింది. తండ్రి తప్ప యేసు ఎప్పుడు తిరిగి వచ్చునో "యే మనుష్యుడైనను ఎరుగడు" అని 36వ వచనము చెప్పుచున్నందునుబట్టి, "ఇవన్నియు" అను పదములో రెండవ రాకడ గూర్చిన ప్రస్తావన చేర్చబడిలేదు.

**వచనము 35.** యేసు తన రెండవ రాకడ మరియు యుగ సమాప్తి గూర్చి అదివరకే ముందుగా తెలియజెప్పాడు (24:29–31), గనుక **ఆకాశమును భూమియు గతించినను** సత్యమును ఇచ్చట ఆయన మరల ధ్రువీకరించుచుండెను. ఈ బోధను ఇతర

వాక్యభాగములు బలపర్చుచున్నవి (2 పేతురు 3:7, 10–12). భూమియు దానిలోని కార్యములు తాత్కాలికమైనవే, కానీ ప్రభువు మాటలు నిత్యమైనవి (1 పేతురు 1:24, 25). **నా మాటలు ఏ మాత్రమును గతింపవు** అని యేసు పలికినప్పుడు, ఆయన ఈ ఉపన్యాసము చేయుచు తాను పలికిన ప్రవచనముల విశ్వసనీయతను నొక్కివక్కాణించుచుండెను.

---

సూచనలు

[1]1 Maccabees 1:47, 54, 59; 2 Maccabees 6:1–11; Josephus *Antiquities* 12.5.4. [2]Josephus *Wars* 4.3.7, 10; 4.5.4; 5.1.3. [3]Ibid., 4.3.10. [4]Ibid., 6.4.7. [5]Ibid., 6.6.1. చూడు ఒక గద్ద మరియు ఒక పంది ఉన్నత స్థానంలో ఉంచబడుట ద్వారా రోమా ప్రభుత్వ ప్రమాణములు ఏ స్థాయిలో ఉన్నవో Michael J. Wilkins, “Matthew,” in *Zondervan Illustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 148. [6]1 Maccabees 2:28. [7]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 573. [8]Eusebius *Ecclesiastical History* 3.5.3. [9]Epiphanius *Against Heresies* 29.7.7. [10]చూడు William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 858.

[11]చూడు Josephus *Antiquities* 13.5.3. [12]మక్కాబీయులు చేసిన తిరుగుబాటులో, మత్తాతీయ మరియు అతని కుమారులు “తమకు కలిగిన వాటన్నిటిని పట్టణములోనే విడిచిపెట్టి కొండలకు పారిపోయారు” (1 Maccabees 2:28; NRSV). [13]Josephus *Wars* 5.12.3. [14]Ibid., 6.3.4. [15]Numbers *Rabbah* 3.6. [16]చూడు Mishnah *Taanith* 1.3. [17]Mishnah *Erubin* 4.3; 5.7. [18]Josephus *Wars* Preface 4. [19]Ibid., 5.10.5. [20]Ibid., 6.9.4.

[21]Ibid., 6.9.3. [22]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 606. [23]Eusebius *Ecclesiastical History* 3.5.3; Epiphanius *Against Heresies* 29.7.7. [24]Josephus *Antiquities* 20.5.1; 20.8.6, 10; *Wars* 2.8.1; 2.13.4, 5; 4.9.3–5. [25]Richard A. Horsley and John S. Hanson, *Bandits, Prophets, and Messiahs: Popular Movements in the Time of Jesus,* New Voices in Biblical Studies, 2 (New York: Winston Press, 1985), 162. [26]*Numbers Rabbah* 11.2; *Song Rabbah* 2.9. [27]Keener, 583. చూడు Homer *Iliad* 11.395, 454; 22.42, 43, 335–36, 353; 24.411; *Odyssey* 3.258–60. [28]Donald A. Hagner, *Matthew 14–28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 707. [29]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 334. [30]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1968), 348.

[31]*Psalms of Solomon* 8.28; 11.2–5; 17.26; *4 Ezra* 13.39–50; *Testament of Asher* 7.7. [32]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 129. [33]Josephus *Wars* 6.4.5. యిర్మీయా 52:12 ప్రకారము, సొలొమోను నిర్మించిన దేవాలయము కూడ ఇదే తేదీన – “ఐదవ మాసము, పదవ దినమున” నాశనము చేయబడినది. రెండు దేవాలయములు తొమ్మిదవ నెల, ఏబ్ మాసములో, నాశనము చేయబడినవని మిశ్నా చెప్పుచున్నది. (Mishnah *Taanith* 4.6.) [34]Lewis, 129–30.